# ఇలాగే సాగిపోనీ

## ఇచ్ఛాపురపు రామచంద్రం

“రాధా!”

పక్కగదిలో - పుస్తకం చదువుతూన్న ఆమె లేచి-ఫ్లాస్కుతో కాఫీ, కప్పులూ పట్టుకుని మాధవ్ గదిలోకి నడిచింది.

అతనింకా మంచంమీదే ఉన్నాడు —కళ్ళు తెరవకుండా.

"ముఖం కడుక్కుని కాఫీ తాగు బావా!"

"అలాగే కాని— ఇప్పుడు ఉదయమా, సాయంత్రమా? టైమెంత యింది?''

"సాయంత్రమే. ఐదుదాటుతోంది. నువ్వు చాలా గాఢంగా నిద్రపోయావు."

"ఔను. నువ్వు పుస్తకం చదువుతూంటే—సంగీతంలా...జోలపాటలా" నవ్వాడు మాధవ్

అతను లేచి కూర్చోబోయాడు. హఠాత్తుగా శబ్దాలు. ఒకదాని వెంట ఒకటి.

"ఏమిటి రాధా?"

ఆమె— భయపడుతూనే మెల్లగా చెప్పింది. ''ఇవాళ—దీపావళి!"

అతను మళ్ళీవెనక్కి వాలిపోయాడు. ''ప్లీజ్...కిటికీలూ అవీ మూసేసి ఆ ధ్వనులు యీ గదిలోకి రాకుండా చేయవూ?''

ఆమె శాయశక్తులా కిటికీలూ ద్వారాలూ మూసింది-వెంటిలేటర్లు తప్ప. ఎలాగో సందుచేసుకుని శబ్దాలు ఆ గదిలోకి ప్రవేశిస్తూనే ఉన్నాయి.

"బాధపడుతున్నావు కదూ రాధా? ఔను. అందరికీ వరంలాటి దీపావళి మనపాలిట తీరని శాపమైపోయింది-" నిట్టూర్చాడతను. ''ఆవేళ... రంగు మతాబుల కాంతుల్లో ఎంత చక్కగా ఉన్నావు! ఇంకా ఆ రూపమే నా మనస్సులోనిలచిపోయింది.''

అది—ఏనాటికీ చెరగదు. నిజమే. నా హృదయంమీద యింకే ముద్రలూ పడవు—"

"ఆమెకి—కన్నీళ్ళపర్యంతంఐంది. "ఎందుకు బావా గతాన్ని తిరగతోడుకోవడం? ఇప్పుడెంత విచారించినా గతం తిరిగి రాదు."

"విచారిస్తున్నావ్ కదూ! ఆనాడే బతిమాలాను—ఈగుడ్డివాణ్ని పెళ్ళిచేసుకుని నీ జీవితం నాశనం చేసుకోవద్దని. విన్నావు కావు..."

"అది కాదు బావా!—"

"నువ్వు కాదన్నా నిజం నాకు తెలుసు.నాకు కళ్ళే పోయాయి. మెదడూ మనసూ మిగిలే ఉన్నాయి—"

ఆగి— "నిన్ను చూడలేకపోయినా నీ మనసు తెలుసుకోగలను. ఆనాడు-తెలిసీ తెలియని తనంలో— ప్రేమ భ్రమలో—త్యాగానికి తలపెట్టి— నా హితోపదేశం పెడచెవినిపెట్టి—పట్టుదలగా పెళ్ళిచేసుకున్నావు గుడ్డివాడినైన నన్ను. నీ త్యాగానికి పరిణామాలు చేదుగా ఉంటాయనీ, ఆవేశంలో జీవితంనాశనం చేసుకోవద్దనీ ఆనాడే చెప్పాను. నువ్వు వినలేదు—"

" నీ కళ్ళు పోగొట్టింది నేనే. నా కోసమే కదా నువ్వు మంటలలోకి ఉరికింది?'' గద్గదిక స్వరంతో అందామె. "నువ్వలా సాహసించకుండా ఉండవలసింది—"

''నా అందాలబొమ్మ అగ్నికి ఆహుతి ఔతూంటే చూస్తూ ఊరుకోవడం నా తరమా? నేను పరాకుగా ఉండబట్టేగా నీ చీర అంటుకుంది? ఆకుపచ్చ మతాబు వెలుగులో నీ అందంచూస్తూ—మైమరచి ... ఆ ప్రమాదానికి కారణం నేనే రాధా—"

"పోనీలే అవన్నీ యిప్పుడెందుకు?"

"అదే మానవ బలహీనత. గతజల సేతుబంధనం నిరుపయోగమని తెలిసినా గతంలో మరోలాగ ప్రవర్తించి ఉండే బాగుండునని బాధపడతాం. ఇప్పుడు నేనేమనుకుంటున్నానో తెలుసా రాధా? ఆదీపావళికి మీ నాన్న పిలిచాడే అనుకో పెళ్ళికాకుండానే అల్లుడిలా పండగకి మీ యింటి కెందుకు రావాలి?..."

"అప్పటికే ప్రధానం జరిగిపోయింది కదా?"

"ఆమాటకొస్తే—నువ్వు పుడుతూనే నా భార్య వయ్యావు కదా?'' నవ్వాడతను. "నువ్వు పుట్టేసరికి నాకు ఆరేళ్ళు. అమ్మ ఏమని చెప్పిందో తెలుసా? 'మాధవ్, నీకు పెళ్ళాం పుట్టిందిరా' అని. మేనమామ కొడుకూ ఓ మొగుడేనా అని నువ్వెక్కడ అనేస్తావేమో అనే నేను బాగా చదువుకున్నాను నీకు ప్రేమలేఖలు రాశాను. ఆ రోజులు ఎంత తియ్యగా గడచిపోయాయి? బహుశా—యిలాటి చేదు దినాలకి చోటిచ్చేందుకే ఏమో!"

"బాధపడకు బావా! గతం ఎప్పుడూ తియ్యగానే ఉంటుంది—''

" నా బాధ నాగురించి కాదు రాధా. నువ్వెంతో అందమైన అమ్మాయివి. చక్కగా అలంకరించుకోడం తెలిసిన దానివి. కాని—ఏం లాభం? ఇప్పుడు నీకు ఉత్సాహం చల్లారిపోయిఉంటుంది. ఎంత చక్కగా తయారయినా ఏం

లాభం, గుడ్డివాడు చూడగలడా, మెచ్చుకోగలడా అని నిర్లిప్తం వహిస్తావు. ఔనులే. అంధుడి ముందు–ఎంత అందమైనా అడివి కాచిన వెన్నెలే!"

"ఇవాళ నేను కొత్తచీర కట్టుకున్నాను. నీ కిష్టమైనఆకుపచ్చ సిల్కు చీర—"

"అబద్ధం ఆడకు రాధా." ఆమె చీరను వేళ్ళతో రాస్తూ అన్నాడు మాధవ్. "కళ్ళులేని వాళ్ళకి అదనంగా కొన్ని శక్తులుంటాయి. ముఖ్యంగా—ఎదుటి వాళ్లు నిజం చెబుతున్నారో అబద్ధమాడుతున్నారో తెలుసుకోగలిగే జ్ఞానం వారికబ్బుతుంది. నిర్దయలో కూడా దయ చూపుతాడుకాబోలు భగవంతుడు."

"ఇప్పుడుకాదు. నేను కొత్త చీర కట్టుకుని వచ్చేసరికి నువ్వు నిద్ర పోతున్నావు."

"సారీ రాధా. లేపలేక పోయావా?"

"ఎందుకు నీ నిద్రకి భంగం కలిగించడం అని మానేశాను."

"తెలిసీతెలియకా కూడా నీ ఉత్సాహంలో నీళ్ళు పోస్తూనే ఉన్నాను రాధా. క్షమించు." నొచ్చుకున్న ట్లన్నాడు. "నేను చూడలేకపోయినా ఊహించగలను. నువ్వు చాలా బాధపడ్డావ్ కదూ ఆ క్షణాల్లో?"

ఆమె—ఏమీ అనలేదు. అతనామెని దగ్గరకు తీసుకుని—ముద్దుపెట్టుకుంటూ—హటాత్తుగా—

"ఏడుస్తున్నావా!" అన్నాడు కళ్ళ మీద పెదవులు అద్దడం మాని.

"ఇవి—ఆనంద బాష్పాలు బావా!"

అత నామెకి దూరంగా జరిగి — "అబద్ధం అన్ని వేళలా పనిచెయ్యదు రాధా. ఆత్మవంచన చేసుకోకు. నువ్వేం ఆలోచిస్తున్నావో నేను గ్రహించగలను నాకే కళ్ళుంటే నిన్ను ఎక్కడెక్కడికో తీసుకు వెళ్ళేవాడిని. సినిమాలు, షికార్లు ...ఎన్నెన్నో కొనిఉండేవాడిని. చీరలు ...నగలు...పూలు,

నేను గుడ్డివాడిని కావడంతో నీ జీవితం నష్టమైపోయింది. ఔనా?"



"నీకు జీవితం గురించి తక్కువ తెలుసు. అన్నీ ఊహలూ, కలలే. జీవితం—ఎవరి ఊహకీ, కలకీ అందనంత తమాషాగా సాగుతుంది."

"ఔను! చిత్రం కాకపోతే నా లాటి గుడ్డివాడికి నీ లాటి దివ్యసుందరిని ప్రసాదించడం ఏమిటి?"

"మాటిమాటికీ గుడ్డివాడి నంటూ నిన్ను నువ్వే న్యూనపరచుకోకు నేను భరించలేను—" నిష్ఠూరంగా అందామె.

"సారీ! నిన్ను కూడా అవమానిస్తునని తెలుసుకోలేకపోయాను. ఇంక అలాగ నిజం గుర్తుతెచ్చి నిన్ను పరోక్షంగా బాధించనులే. వాగ్దానం చేస్తున్నాను. ఈసారి క్షమించు ప్లీజ్...."

"నే నన్నదీ—నా గురించి కాదు నీ గురించి..."

"ఎవరి గురించి అయినా సరే."

"ఒక్కమాటచెబుతాను వింటావా?"

"వింటాను."

"తేలికగా కొట్టిపారెయ్యవుకదా?"

"ఉహూఁ."

"దేవుడేదిచేసినా మన మంచికే..."

"జీవితంలో ఓడిపోయాక వేదాంతమూ వైరాగ్యాలే శరణు."

"నిజానికి మనం ఓడిపోలేదు. గెలిచాం."

"ఎలా?" వింత విన్నట్లన్నాడు.

"నిజానికి—నువ్వు సంపాదించకపోయినా రోజులు గడవని పరిస్థితులు కావు. కాని—ఎమ్మే చదివిన నువ్వు తప్పకుండా ఉద్యోగం చేసేవాడివి. అప్పుడు యిలాగ నిన్ను నిరంతరమూ సేవించుకునే భాగ్యం నాకు దక్కేది కాదు. పరోక్షంగా—దేవుడు నాకుమేలు చేశాడేమో!"

"రాధా!" భారంగా నవ్వాడు మాధవ్ "ఇసకలోనే రత్నాలు వెతుక్కోవలసిన పరిస్థితి మనది."

"ఏమీ కాదు. జీవితాన్ని సవ్యంగా అర్థంచేసుకోలేకపోతున్నా వంతే."

ఆమె—లేచి వెళ్ళబోయింది.

"నాకింకా కాఫీ ఇవ్వనే లేదు-''

ఆమె-ఆగి-కాఫీ కప్పు అందించింది.

"నువ్వూ తీసుకో—"

కప్పు ఆమె కిచ్చేశాడతను.

బయటనుంచి ధ్వనులు.

''ఇవాళ—యిళ్ళన్నీ కలకలలాడుతాయి కదూ, మన యిల్లు తప్పించి?"

ఆమె మౌనం దాల్చింది.

'' ఆ వెలుగులూ, సందడీ చూడాలనుందా?"

ఈసారి ఆమెకి కోపం వచ్చింది

"నిజంగా నువ్వు పిచ్చివాడివై పోతున్నావు."

''ఎప్పుడో ఐపోయాను. నువ్వు పట్టుదలగా నన్నే పెళ్ళి చేసుకున్నప్పుడు కారణం తెలియక..."

"నువ్వు కాకపోతే మరెవరూ నన్ను పెళ్ళిచేసుకునేవారు కాదు—"

"చాలా తియ్యని అబద్ధం. అందాల అమ్మాయిని, ఆస్తిపరురాలిని, కాదనే మూర్ఖుడెవరన్నా ఉంటే—వాడు నా లాటి గుడ్డివాడే."

''అందం కంటే అంతర్యం ముఖ్యం. నా అంతర్యంలో నీకు తప్ప మరెవరికీ ప్రవేశం లేదు."

''అందాన్ని తేలిగ్గాతీసెయ్యకు..."

''అందం అశాశ్వతం. అతి సుకుమారం..."

"సత్యం, శివం, సుందరం. అందమైన దానివైఉండీ నీ అందాన్ని అలా తేలిక పరచుకుంటావేం? నా ముందు సౌందర్యాన్నెప్పుడూ తూలనాడకు. నువ్వు అందంగా ఉండకపోతే మన జీవితాల కథలు వేరుగా ఉండేవి. రాధా! ప్రమాదం జరిగేముందు— ఆకుపచ్చని మతాబుల వెలుగులో అలవోకగా చూస్తూ నిలుచున్నావే, ఆ భంగిమే నా హృదయ ఫలకంమీద బలంగా ముద్రించుకుపోయింది. నేను చూసిన చివరి చూపు అదేనేమో! నా హృదయంలో...... ఊహలలో...కలలలో...ఏనాటికీ నువ్వలాగే మిగిలిపోతావు —"

''మంచిదే?'' ఆమె ఎలాగో ఏడుపు ఆపుకుంది.

"కాని—నా దొక్కటే చింత!''

''ఏమిటి?" భయంగా ఆత్రంగా అడిగిందామె.

"ఆ దృశ్యం ఏడాది క్రిందటిది. ఈ లోగా నువ్వెన్ని కొత్త అందాలు సంతరించుకున్నావో కళ్ళతో చూడలేకపోతున్నానని. దేవుడు ఉండి- నన్ను వరం కోరుకోమంటే-కనీసం ఏడాదికో సారయినా నా రాధ అందం కళ్లారా చూసుకోనీ-అని అడుగుతాను."

"దేవుడు లేడేమో?"

"ఉన్నాడనుకుందాం." నవ్వాడతను.

ఆమె అతని ముఖంలోకే తదేకంగా చూస్తోంది. అంతలోనే లేచి - దీపం వేసింది.

కళ్ళేలేనప్పుడు వెలుగేమిటి, చీకటేమిటి? సారీ ... నిన్ను మరచిపోయాను.

ఆమె — అక్కడి నుంచి వెళ్ళబోయింది.

"రాధా! ఒక్కసారి కొత్త చీర కట్టుకుని రావూ? పూలుకూడా పెట్టుకుని–"

"అలాగే...''

"కొత్త చీర కట్టుకుంటే దేవుడికి నమస్కరిస్తావుగా? ఈసారి—నాకుకళ్ల రావాలని ప్రార్థించు."

ఆమె—నిశ్శబ్దంగా కన్నీరుకారుస్తూ బయటకు వెళ్ళింది.

మాధవ్ ఆత్మన్యూనతా భావం నుంచి పీడించబడుతున్నాడు. దానికి నివారణోపాయం తనకి తెలుసు. ఇన్నాళ్ళుగా తనూ, తనతోపాటు చాలామందీ అతని నుంచి కాపాడుకుంటూ వస్తున్న ఆ అతి చేదు నిజం చెప్పేస్తే— అతనేమైపోతాడో?

వొద్దు భరించలేని నిజం కంటే తీయని కలే నయం. అతనికి మిగిలిన కొద్ది ఆనందాన్నీ తను ఎందుకు భగ్నం చెయ్యాలి?

కొత్తచీర కట్టుకుంది.

పూలు పెట్టుకుంది.

బొట్టు పెట్టుకుంటే — వేళ్ళు వణికాయి, బొట్టు సరిగా లేదేమో? చూసుకుందామంటే ఆ యింట్లో అద్దమనేదిలేదు.

ఔను. తనని కాపాడడానికి ఏ ప్రమాదంలో సాహసించి తన రెండు కళ్ళు మాధవ్ పోగొట్టుకున్నాడో, అదే ప్రమాదంలో— శరీరం అంతా కాలి— గాయాలు మానినా—వొంటినిండా అతి వికృతమయిన మచ్చలు శాశ్వతంగా మిగిలిపోయి—తన అందాన్నీ పచ్చని రంగునీ చెదలు పట్టినట్లు తినేశాక— అద్దంలో బింబం చూసుకుని తనకి తనే భయపడి— చాలా ఏడ్చుకున్నాక— ఇంట్లోని అద్దాలన్నీ తనే పగలకొట్టేసింది. ఆ ప్రయత్నం-సగమేఫలించింది. తన ప్రతిబింబం తనకే భయంగొల్పేంత వికృత రూపాన్ని మాధవ్ నుంచి మాత్రమేదాచగలదు. తననుంచి దాచుకోలేదు. ఎప్పటిదో దృశ్యం—చిరస్థాయిగా మిగిలిపోయినది అంతర్యంలో.

కళ్ళు తుడుచుకుని- ''నీకు కళ్ళు రావాలని నేను భగవంతుణ్ని ప్రార్థించలేను నీమీదనాకెంతో ప్రేమ. కాని-నీకు కళ్లు వొస్తే-నన్ను చూడనూలేవు. భరించనూలేవు ఈ స్వార్థపరురాల్ని క్షమించు. మనదాంపత్యంలో యీ మాత్రపు ఆనందమయినా మిగిలిఉండాలంటే-నీకు చూపు రాకూడదు. నీ హృదయంలో నిలిచిన ఆనాటి అందాల రాధ చిరకాలం అలాగే ఉండిపోవాలి." అనుకుంటూ మాధవ్ గదిలోకి నడిచింది రాధ.

అవతల - మెరుపులలాటి వెలుగులు. అట్టహాసంగా దీపావళి.

గది తలుపులు గట్టిగా మూసుకున్నాయి.